# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# తెలంగాణ రాష్ట్ర కమిటీ

**పత్రికా ప్రకటన** **తేదీ.21.11.2021**

కేంద్ర (బీజేపి) ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక సాగు చట్టాలను నిరసిస్తూ యేడాది కాలంగా అవిశ్రాంతంగా పోరాడి విజయం సాధించిన రైతంగానికి విప్లవ జేజేలు.

ఈ పోరాటాన్ని అణిచి వేయడానికి బీజేపి ప్రభుత్వం అమలు చేసినా నిర్బంధం మూలంగా, కరోనా పాండమిక్ కారణంగా 700 మందికి పైగా రైతాంగం అసువులు బాసారు. అనేక మంది గాయాల పాలయ్యారు. వీరికి, వీరి కుటుంబ సభ్యులకు సానుభూతిని, బాధను తెలియ పరుస్తున్నాము.

భారత వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలకు పూర్తిగా అప్పజెప్పడానికి యేడాది క్రితం బీజేపి ప్రభుత్వం 2020 సెప్టెంబర్ రైతు వ్యతిరేక సాగు చట్టాల ఆర్డినెన్స్ లను తీసుకొచ్చి ఎలాంటి చర్చ లేకుండా ఏక పక్షంగా ఆమోదించింది. ఈ నేపధ్యంలోనే ఒక్క సారిగా ఉత్తర భారత రైతాంగం లేచి నిలిచింది. నవంబర్ 26,27 తేదీలలో పంజాబ్, హర్యానా రైతులు చలో డిల్లీ కార్యక్రమం తీసుకున్నారు. దీనితో దేశ వ్యాప్త ఉద్యమంగా వ్యాప్తి చెందింది. సాగు చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రిక రైతాంగ ఉద్యమం అప్రతి హాతంగా కొనసాగుతూ ఒక మైలురాయిగా నిలిచింది.

ఈ ఉద్యమాన్ని అణిచివేయడానికి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బ్రాహ్మణీయ హిందుత్వ బీజేపి ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడింది. రైతులపై తూటాలు పేల్చింది. బాష్పవాయువులు ప్రయోగించింది. లాఠిచార్జీ చేసింది. మతం రంగు పులిమింది. దేశ ద్రోహులు, సంఘ విద్రోహ శక్తులు, ఖలీస్తాన్ తీవ్ర వాదులు రైతు ఉద్యమంలో చేరారని రైతులపై చేయని అరోపణ, దుష్ప్రచారం లేదు. రైతులు డేరాలు వేసినా సరిహద్దుల్లో బారికేడ్లు, ముళ్ల కంచలు పెట్టి పోలీసు క్యాంపులు నిర్మించారు. ఒక దశలో ఉద్యమ కారులను భయ భ్రాంతులకు గురి చేయడానికి బీజేపి గుండాలు దాడులు చేశారు. ఉత్తర ప్రదేశ్ లో మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రా పోరాడుతున్న రైతులపై కారుని ఎక్కించి ఆతరువాత కాల్పులు చేశారు. దుచర్యలో 8 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. మరొక్క ప్రక్క ప్రపంచ దేశాల్లో కబళించిన కరోనా మహమ్మారి డిల్లీలో పోరాడుతున్న రైతాంగాన్ని బలి తీసుకుంది. అయినప్పటికి తమ పోరాట పటిమ సడలకుండా మొక్కవోని సంకల్పంతో రాజీలేకుండా విరోచిత పోరాటాన్ని కొనసాగించారు. మొండి పట్టుతో కూర్చున్న బీజేపి ప్రభుత్వం మెడలు వంచి గెలుపు సాధించారు. ఈ సందర్భంగా రైతాంగానికి అబినందనలు తెలియజేస్తున్నాము. ఇదే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులపై మోపిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల అప్రమత్తంగా వుంటూ తమ పోరాటాన్ని కొనసాగించాలని రైతాంగాన్ని కోరుచున్నాము.

విప్లవాభివందనాలతో
అధికార ప్రతినిధి
జగన్